30న కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం



విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ఈ నెల 30వ తేదీన ప్రారంభిస్తున్నామని చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి, విశాఖ ఎంపీ శ్రీభరత్‌లు దీనిని ప్రారంభిస్తారని చెప్పారు. ఇది విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు మరింత అదనపు ఆకర్షణగా నిలుస్తుందన్నారు.

ఇంటికో ఉద్యోగమే లక్ష్యం

బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు జీవో జారీ

- ప్రజల తలసరి ఆదాయం పెరగాలి
- టీడీపీకి కార్యకర్తల ఐక్యతే బలం
- పార్టీ శ్రేణుల సమావేశంలో హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇంటికో ఉద్యోగం వుండాలన్నదే తన లక్ష్యమని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకోవడం, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా దృష్టి పెట్టానని హోం మంత్రి అనిత తెలిపారు. త్వరలో నక్కపల్లి మండలంలో బొమ్మల పరిశ్రమ ఏర్పాటవుతుందని, దీనికి జీవో కూడా విడుదలైందన్నారు.



పార్టీ పదవులు పొందిన వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హోం మంత్రి అనిత

సోమవారం మధ్యాహ్నం తన క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన నియోజకవర్గం టీడీపీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా పార్టీ, పార్టీ అనుబంధ సంస్థల పదవులు పొందిన వారితో హోం మంత్రి అనిత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పునాదని, పార్టీ శ్రేణుల ఐక్యతే పార్టీకి బలమన్నారు. పదవులంటే అధికారం చెలాయించడం కోసం కాదని, బాధ్యతగా వుంటూ నిరంతరం ప్రజలకు సేవ చేయాలన్నారు. వైసీపీ పాలనలో పెట్టుబడుదారుల సమ్మిట్‌లో భోజనాల కోసం కొట్టుకున్నారని, తమ ప్రభుత్వ హయాంలో ఇటీవల జరిగిన సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల మేర పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందం కుదిరిందన్నారు. ఇందులో అనకాపల్లి ... మిగతా 8వ పేజీలో

అన్నదాతకు అండగా ఉంటాం

- హోం మంత్రి అనిత



రైతులకు అన్నదాత సుఖీభవ నమూనా చెక్కును అందిస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని పెదరాంభద్రపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన రైతన్నా మీకోసం - రైతు వారోత్సవాలు' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో సుమారు 2 లక్షల 42 వేల మంది రైతులకు రూ.320 కోట్లు జమ చేశామన్నారు. రైతులు సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగు చేయాలన్నారు. వారంలో ఒకరోజు పాఠశాల విద్యార్థులను సేంద్రీయ వ్యవసాయం చేసే పొలాలకు తీసుకు వెళ్లి వ్యవసాయం నేర్పించాలన్నారు. అంతకు ముందు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న పొలాన్ని, ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె పరిశీలించారు. రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకంలో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గ రైతులకు రూ.25కోట్ల 60 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ఆశాదేవి, ఏడీఏ కె.ఉమాప్రసాద్, ప్రకృతి వ్యవసాయం ఏడీఏ లచ్చన్న, వ్యవసాయాధికారులు పి.ఆదినారాయణ, సౌజన్య, ఏఎంసీ చైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, పార్టీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, పరిశీలకులు వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు దేవవరపు ఆనంద్, వంకా వెంకటరమణ, కాశీవిశ్వనాథ్, తహశీల్దార్ ఎస్‌ఏ మహేశ్వరరావు, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

- ఆర్‌ఆర్‌ఆర్ పథకం కింద 47 పనులకు రూ.50 కోట్లతో ప్రతిపాదనలు
- తాండవకు రూ.12.24 కోట్లు
- మైనర్ ఇరిగేషన్ పనులకు రూ.12 కోట్లు



రాంబిల్లి మండలం రజాలా గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న శారదానది గట్టు

నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ నర్సీపట్నం డివిజన్‌లో సాగునీటి చెరువుల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 'ట్రిపుల్ ఆర్' (రిపేర్, రెనోవేషన్, రెస్టోరేషన్) పథకం కింద 47 చెరువుల అభివృద్ధికి రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చును భరిస్తాయి. ఐదు ఎకరాలు, అంతకుమించి గర్భం ఉన్న చెరువుల అభివృద్ధికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. పంట కాలువల ఆధునికీకరణ, చెరువు గట్లు పటిష్ఠం, మదుములకు మరమ్మతులు, అవసరమైనచోట కొత్త మదుముల నిర్మాణం వంటి పనులు చేస్తారు.

గత వైసీపీ ప్రభుత్వం అన్ని శాఖల మాదిరిగానే సాగునీటి పారుదల రంగాన్ని కూడా నిర్వీర్యం చేసింది. ఒక్క ఏడాది కూడా చెరువులు, పంట కాలువలు, ఇతర సాగునీటి వనరుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పంట కాలువల్లో పూడిక విపరీతంగా పేరుకుపోయింది. గట్లపైన, కాలువల్లో తుప్పలు పెరిగిపోయాయి. సిమెంట్ లైనింగ్‌లు దెబ్బతిన్నాయి. మదుముల గేట్లు పాడై నీరు వృథాగా పోయేది. ఈ సమస్యల కారణంగా ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందేది కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. జల వనరుల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం ఈఈ బాలసూర్యం 'ట్రిపుల్ ఆర్' పథకం కింద చెరువుల అభివృద్ధికి అంచనాలు తయారు చేసి రూ.50 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

మొంథా తుఫాన్ ప్రభావం ఎంతంటే?

మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న సాగునీటి పథకాల మరమ్మతులకు జలవనరుల శాఖ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తుఫాన్ ప్రభావంతో అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలోని ఐదు నియోజకవర్గాలకు సాగునీరు అందించే తాండవ ఆనకట్టకు సంబంధించి పలు చోట్ల పంట కాలువలు దెబ్బతిన్నాయి. అనకాపల్లి జిల్లాలో 89 పనులకు రూ.9.88 కోట్లు, కాకినాడ జిల్లాలో 24 పనులకు రూ.2.36 కోట్లు చొప్పున మొత్తం రూ.12.24 కోట్లతో 113 పనులకు ప్రతిపాదనలు పంపారు. మొంథా తుఫాన్ కారణంగా మైనర్ ఇరిగేషన్ పథకాలు కూడా చాలా చోట్ల దెబ్బతిన్నాయి. రాంబిల్లి మండలంలో రజాలా అగ్రహారం వద్ద శారదానది కుడి కాలువ గట్టు 150 మీటర్లు కొట్టుకుపోయింది. మునగపాక మండలం కుమారపురం వద్ద రోలుగెడ్డ గట్టు కొట్టుకుపోయింది. మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామంలో జాగారం గెడ్డ గట్టు దెబ్బతిన్నది. నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం రావణాపల్లి ఆనకట్ట గట్టు రాతి పేర్పు జారిపోయి గట్టు కుంగింది. జలవనరుల శాఖ డివిజన్ పరిధిలోని 14 మండలాలలో మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న మైనర్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి 148 పనులకు రూ.12 కోట్లతో అంచనాలు ... మిగతా 8వ పేజీలో

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- అండర్‌బ్రిడ్జి వద్ద గడ్డర్‌ను ఢీకొన్న బండరాళ్ల లోడు లారీ
- విరిగిపడిన గడ్డర్
- రోడ్డుపై పడిన బండరాయి



విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద విరిగి రోడ్డుపై పడిన గడ్డర్‌ను క్రేన్‌తో తొలగిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. అంతేకాకుండా లారీలోంచి పెద్ద బండరాయి రోడ్డుపై పడింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటే రైల్వే ట్రాక్ దెబ్బతినే పరిస్థితి ఉండేది. క్వారీ లారీలు పట్టణంలోకి రాకూడదని ఎన్ని షరతులు విధించినా పోలీసుల కళ్లు గప్పి అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి తెల్లవారుజాము వరకు విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నుంచే డ్రైవర్లు భారీ బండరాళ్ల లోడుతో రాంబిల్లి వైపు వెళుతున్నారు. ఇదే తరహాలో సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో భారీ బండరాళ్లతో వెళుతున్న లారీ విజయరామరాజుపేటకు అతి సమీపంలోని ఆర్‌పీఎఫ్ అధికారులు ఏర్పాటు చేసిన సేఫ్ గడ్డర్‌ను బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. మరో రెండు గడ్డర్లు లారీలో ఉన్న బండరాళ్ల లోడు కారణంగా దెబ్బతిన్నాయి. గడ్డరు నేలకొరగడంతో పాటు లారీలో ఉన్న ఒక బండరాయి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఆ మార్గంలో ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి తన సిబ్బంది, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్‌ఐ శేఖరం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని హుటాహుటిన క్రేన్ సహకారంతో రోడ్డుపై విరిగి పడిన ఇనుప గడ్డర్‌ను పక్కకు తొలగించారు. అలాగే బండరాయిని ... మిగతా 8వ పేజీలో



లారీ పైనుంచి పడిన బండరాయి

కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.21.18 కోట్లు మంజూరు

జీవో విడుదల చేసిన ప్రభుత్వం

- జిల్లా కోర్టు సహా నాలుగు కోర్టుల భవనాలకు నిధులు
- అన్ని హంగులతో త్వరగా నిర్మాణాలు పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కోర్టు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును సత్కరిస్తున్న న్యాయవాదులు

చోడవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కోర్టుతో సహా నాలుగు కోర్టుల భవన సముదాయాల నిర్మాణాలకు రూ.21 కోట్ల 18 లక్షలు మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. 9వ అదనపు జిల్లా కోర్టుతో పాటు మరో మూడు కోర్టులు ప్రస్తుతం శిథిల ప్రాంగణంలో నడుస్తున్నాయి. ఈ కోర్టు భవనాల నిర్మాణాలకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రూ.19.54 కోట్లు విడుదలైనప్పటికీ, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కోర్టు భవనాల నిర్మాణాలను పట్టించుకోలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టు భవనాల నిర్మాణాలకు సంబంధించి స్థానిక న్యాయవాదుల వినతి మేరకు ఎమ్మెల్యే రాజు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో గతంలో మంజూరు చేసిన నిధులకు అదనంగా మరో రూ 2 కోట్లు కలిపి మొత్తం రూ.21 కోట్లు విడుదల చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేస్తాం

జిల్లా కోర్టుతో సహా నాలుగు కోర్టులకు శాశ్వత భవన నిర్మాణాలకు ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీని సోమవారం రాత్రి న్యాయవాదులకు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని సదుపాయాలతో కోర్టు కాంప్లెక్స్‌ను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అలాగే 150 సంవత్సరాల క్రితం రాతితో కట్టిన పురాతన భవనాలు దెబ్బతినకుండా, ఆ భవనాన్ని పరిరక్షించే దిశగా కూడా ... మిగతా 8వ పేజీలో

రైల్వే గేటుతో ఎన్ని కష్టాలో..

- వాహనచోదకుల అవస్థలు
- గంటల తరబడి పడిగాపులు
- అండర్ పాస్ వే కోసం ఎదురుచూపులు



పెదపల్లి రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు (ఫైల్)

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లి రైల్వే గేటు అవతల ఉన్న పలు కాలనీల ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. రైళ్ల రాకపోకల సమయంలో రైల్వే గేటు వేసి ఉండడంతో వాహనచోదకులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు అవస్థలు తప్పడం లేదు.

మునిసిపాలిటీలోని పెదపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, శేషుకొండ, చిన్న గొల్లలపాలెం, రామ్‌నగర్, టిడ్కో కాలనీ సముదాయం, అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఎలమంచిలి పట్టణంలోకి రావాలంటే ప్రతి రోజూ పెదపల్లి రైల్వే గేటు దాటాల్సిందే. రైళ్ల సంఖ్య పెరగడంతో వాటి రాకపోకల సమయంలో గేటు వేసి ఉంటుంది. దీంతో గేటు వద్ద వాహనచోదకులకు పడిగాపులు తప్పడం లేదు. అత్యవసర సమయంలో ఆస్పత్రులకు వెళ్లే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అండర్ పాస్ వే నిర్మించాలని ఎన్నో ఏళ్లగా ప్రజలు కోరుతున్నారు. కానీ అది కార్యరూపం దాల్చడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చొరవ తీసుకుని రైల్వే, మునిసిపల్ అధికారుల సమన్వయంతో అండర్ పాస్ వే నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసేలా కృషి చేశారు. దీంతో అండర్ పాస్ వే నిర్మిస్తే తమ కష్టాలు తీరతాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఉదయం 9 గంటలైనా వీడని మంచు తెరలు



కోటవురట్లలో సోమవారం ఉదయం కురుస్తున్న పొగమంచు

కోటవురట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనాలు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాయి. గత నాలుగు రోజుల నుంచి సూర్యుడు ఉదయించినా కూడా పొగమంచు తగ్గడం లేదు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి చలి ప్రారంభమవుతోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు.

బల్క్‌డ్రగ్‌పై ఆందోళనకు తాత్కాలిక బ్రేక్



మత్స్యకారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

- హోం మంత్రి అనితను కలిసిన మత్స్యకారులు
- సీఎం వద్దకు తీసుకువెళతానని మంత్రి హామీ
- ధర్నా విరమిస్తున్నట్టు తహశీల్దార్‌కు లేఖ అందజేసిన గ్రామస్థులు

నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న ధర్నాకు తాత్కాలిక బ్రేక్ పడింది. సోమవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద హోం మంత్రి వంగలపూడి అనితను పార్టీలకతీతంగా ... మిగతా 8వ పేజీలో

మంగళగిరి ప్రజాదర్బార్‌లో 'ప్రగడ' వినతుల స్వీకరణ



మంగళగిరిలో అర్జీలు స్వీకరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఏపీ ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని శాఖల వారీగా అధికారులకు పంపించినట్టు ప్రగడ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ఎస్.రాయవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత పాయకరావుపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాసరావు నియమితులయ్యారు. సోమవారం నక్కపల్లి మండలంలోని హోం మంత్రి అనిత నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శ్రీనివాసరావు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చిన హోం మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. శ్రీనివాస రావును టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడిగా గంట్యాడ



నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గం ఐటీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడిగా మండలంలోని రేబాక గ్రామానికి చెందిన గంట్యాడ రమేశ్, ఐటీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా గరగ రాజేశ్ నియమితులయ్యారు. సోమవారం హోం మంత్రి అనిత సమక్షంలో వారు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తామని చెప్పారు. తమకు ఈ అవకాశం కల్పించినందుకు హోం మంత్రి అనితకు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడుగా శివకుమార్



పాయకరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని వెంకట నగరం గ్రామానికి చెందిన వంకా శివకుమార్ నియమితులయ్యారు. సోమవారం నక్కపల్లి సమీపంలోని స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి అనిత ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శివకుమార్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. శివకుమార్ తండ్రి వంకా సత్యనారాయణ జెడ్పీటీసీ సభ్యుడుగా పనిచేశారు. ఈ సందర్భంగా వంకా శివకుమార్‌కు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

రైతులకు భరోసాగా రైతన్న.. మీ కోసం

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో వ్యవసాయ రంగానికి, రైతులకు దోహదపడే కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం ఐదు విధానాలతో కార్యాచరణ చేపట్టిందని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. మండలంలో పేటకట్టు రైతులు కల్లాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు, పాడి రైతులకు అండ వంటి వాటి అమలు గురించి వివరించారు. ప్రభుత్వం పంపిన కరపత్రాలను రైతులకు అందజేశారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ



ఉద్దండపురంలో సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురంలో సోమవారం రాత్రి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పి.పాపారావు, సర్పంచ్ వెంకటేశ్, ఎంపీటీసీ సభ్యుడు బచ్చల రాజు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాపులో 5 మద్యం సీసాలు పట్టివేత

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్‌లోని పడాల రాజు పాన్‌షాపులో 5 మద్యం సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

'ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం'

పాయకరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దారు ఎస్‌ఏ.మహేశ్వరరావు తెలిపారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రంలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు. అర్జీలను ఆయా శాఖలకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, తమ పరిధిలో పరిష్కారం కాని అర్జీలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ-2 రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

'రైతన్న మీకోసం సద్వినియోగం చేసుకోవాలి'

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి మోహనరావు కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎలమంచిలి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 25,212 రైతు కుటుంబాలు ఉన్నాయన్నారు. రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు ఐదు విధానాలు అమలు చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు, పాడి రైతులకు అండపై గ్రామాలలోని ప్రతి రైతు సేవా కేంద్ర పరిధిలో అధికారులు 2 బృందాలుగా ఏర్పడి హౌస్ హోల్డు సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డా.కన్నంనాయుడు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలి

▸ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర హోంమంత్రి అనిత

పాయకరావుపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం సమీపంలో సోమవారం వ్యవసాయ శాఖ నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆమె రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి, ఉత్పత్తులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాల్తేరు గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి నాగేంద్ర తన 1.50 ఎకరాలలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. తెగుళ్ల నివారణకు ఎటువంటి రసాయనాలు పిచికారీ చేయకుండా వేపాకు, తూటికాడ, పుల్లటి మజ్జిగ తదితర వాటితో తయారు చేసిన ద్రావణాన్ని పిచికారీ చేస్తామన్నారు. ఆవుపేడ, పుట్టమట్టి, తదితర వాటితో ఘన జీవామృతం చేసి ఎరువుగా వాడతామన్నారు. అదేవిధంగా డొంకాడ గ్రామానికి చెందిన రైతు గణేశ్ ప్రకృతి వ్యవసాయంలో కూరగాయలను పండిస్తున్నట్టు తెలిపాడు. పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన తాడి సూరిమూర్తి, కలిగట్ల శ్రీనివాసరావు ప్రకృతి వ్యవసాయంలో వరిని పండించామని, దిగుబడిలో ఎటువంటి మార్పు లేదని తెలిపారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు శ్రద్ధ చూపాలన్నారు. దీనివలన కాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ఆశాదేవి, ఏడీఎలు ఉమాప్రసాద్, లచ్చన్న, వ్యవసాయాధికారులు ఆదినారాయణ, సౌజన్య, ఏఎంసీ చైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, వినోద్‌రాజు, శింగంశెట్టి నాగేశ్వరరావు, తాడి నానాజీ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక పంచాయతీ నిధులు పక్కదారి

▸ గోప్యంగా ఉంచిన అధికారులు

▸ సొంత అవసరాలకు వినియోగించుకున్న బిల్ కలెక్టరు

▸ రికవరీ చేస్తున్నామన్న పంచాయతీ కార్యదర్శి

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటికొప్పాక పంచాయతీ నిధులు పక్కదారి పట్టాయి. పంచాయతీలో ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నులను సొంత అవసరాలకు బిల్ కలెక్టర్ వినియోగించుకున్నారు. అయితే ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని ఏటికొప్పాక పంచాయతీలో ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నుల్లో సుమారు రెండు లక్షల రూపాయలను బిల్ కలెక్టరు సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. బిల్ కలెక్టర్ రమణబాబు నాలుగు నెలల క్రితం జరిగిన బదిలీల్లో ఏటికొప్పాక పంచాయతీకి వచ్చారు. ఈ పంచాయతీలో ఏడాదికి రూ.ఆరు లక్షల నుంచి రూ.ఎనిమిది లక్షల వరకు ఇంటి పన్నులు వసూలు కావాలి. అయితే వసూలు చేసిన ఇంటి పన్నుల మొత్తం పంచాయతీకి జమ చేయాలి. కానీ బిల్ కలెక్టర్ పంచాయతీకి జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తేలిందని పంచాయతీ సెక్రటరీ తెలిపారు. అయితే పంచాయతీ ఆర్థిక వ్యవహారాలతో పాటు నిర్వహణ పనులను పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీ, ఎంపీడీఓ, జిల్లా అధికారులు పర్యవేక్షించాలి. కానీ ఆ దిశగా ఎవరూ చేయకపోవడంతో ఇంటి పన్నుల ద్వారా వసూలైన మొత్తంలో సుమారు రెండు లక్షల రూపాయల వరకు బిల్ కలెక్టర్ సొంతానికి వాడుకున్నారు. ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా అధికారులు గోప్యంగా ఉంచారు. దారి మళ్లిన నిధుల రికవరీకి చర్యలు చేపట్టారు. ఈ విషయాన్ని పంచాయతీ సెక్రటరీ ప్రసాద్‌ను ఫోన్‌లో అడుగ్గా.. పంచాయతీకి చెందిన నిధులు బిల్ కలెక్టర్ సొంత అవసరాలకు వినియోగించుకున్నట్లు తేలడంతో ఆయన జీతం నుంచి రికవరీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొంతమేరకు రికవరీ చేశామన్నారు.

ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

పాయకరావుపేట రూరల్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలని హైందవ ధర్మ యజ్ఞం అధ్యక్షుడు రాజేశ్ అన్నారు. మండలంలోని పాల్తేరులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు ఆశపడి సనాతన ధర్మాన్ని విడిచిపెట్టవద్దన్నారు. ఈ సందర్భంగా సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేశారు. బలవంతపు మత మార్పిడిలపై తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు శ్రీరామరాజు, న్యాయ సలహాదారు అల్లూరి రాజు, హైందవ ధర్మ యజ్ఞం ట్రెజరర్ నీలాపు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పశు వైద్యాధికారిని నియమించాలి'



తోటాడ పశువైద్య కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న పాడి రైతులు

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పశువులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యుడు, సిబ్బందిని నియమించాలని మండలంలో తోటాడ రైతులు మొరపెట్టుకున్నారు. సోమవారం పశువైద్య కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. పూర్తిస్థాయిలో పశువులకు వైద్యం అందడం లేదన్నారు. ఇన్‌చార్జి వైద్యుల ద్వారా అరకొర వైద్యమే అందుతుందన్నారు. ప్రైవేటు వైద్యులను తీసుకు వస్తే రూ.వేలలో ఫీజులు ఇవ్వాల్సి వస్తోందని వాపోయారు. పూర్తిస్థాయి వైద్యాధికారిణి నియమించాలని రైతులు కోరిబిల్లి శేఖర్, బొడ్డేడ నాగేశ్వరరావు, కర్రి విష్ణు, కోరిబిల్లి వెంకట్, కాండ్రేగుల గోపి, బాపు తదితరులు డిమాండ్ చేశారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోండి

▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



సర్దార్ వల్లభ్ భాయి పటేల్, భరతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, తదితరులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవరుచుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కేంద్ర యువజన సర్వీసులు, యువజన శాఖ ఆధ్వర్యంలో యూనిటీ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. అచ్యుతాపురం జంక్షన్ నుంచి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల వరకూ ఎన్‌సీసీ విద్యార్థులు, కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణం వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో వివిధ సంస్థలను విలీనం చేయడానికి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ముఖ్య భూమికను పోషించారన్నారు. మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం యువతకు మానసిక, శారీరక నైపుణ్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా పటేల్, భరతమాత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ధర్మిరెడ్డి డ్రీమ్స్ నాయుడు, భక్తసాయిరాం, అగ్గాల హనుమంతరావు, ప్రశాంతి సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, రమేశ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు

▸ మండల సమావేశంలో ఎంపీపీ గోవింద ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఎంపీపీ బోదెపు గోవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యలపై వినతులు స్వీకరించేందుకు శాసనసభ్యులు ఒకచోట, టీడీపీ నేతలు మరోచోట వినతులు స్వీకరిస్తుంటే.. ప్రజలు ఎక్కడికి వెళ్లాలో.. ఎవరికి వినతులు ఇవ్వాలో తెలియని సందిగ్ధ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఎంపీపీగా సుమారు 50 నెలలు పాటు పాలన సాగించానని, తానెప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తూ వారి సమస్యల పట్ల సత్వరం స్పందించానన్నారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడం జరిగిందని శాఖల వారీగా అధికారులు వివరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై అధికారులు సత్వరం స్పందించడం లేదని, కాలయాపన చేస్తున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వం హయాంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని అధికారులు వివరించారు. మేజర్ పంచాయతీ ఏటికొపాకలో పంచాయతీ నిధులు సొంత అవసరాలకు వినియోగించుకున్న వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు మండల పరిషత్ అధికారులు తెలిపారు. పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రైతన్న.. మీ కోసంలో 974 కుటుంబాల సర్వే



చౌడువాడలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

కోటవురట్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. మండలంలోని 18 సచివాలయాలు పరిధిలో గల 25 పంచాయతీల్లో సిబ్బంది రైతన్న కోసం కార్యక్రమం సర్వే చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి రైతుతో స్వయంగా మాట్లాడి వివరాలు సేకరించారు. రైతులు తీసుకున్న పంట రుణాలు, అన్నదాత సుఖీభవ, సబ్సిడీ సొమ్ము సక్రమంగా వినియోగిస్తున్నారా.. ఇంకా సాగు అభివృద్ధికి ఏమైనా కావాలా.. ఆర్థికంగా నిలబడేందుకు చేపట్టాల్సిన చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి ఒక బృందం చొప్పున ముగ్గురు సభ్యులు సర్వే చేశారు. ప్రతి ఇంటి వద్ద అర్ధగంట సేపు సర్వే చేయాల్సి వచ్చింది. తొలి రోజు 974 రైతు కుటుంబాల వివరాలను సేకరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

పాయకరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగిన శుభకార్యానికి వీడియో షూట్ చేసేందుకు రాజమహేంద్రవరం నుంచి పాయకరావుపేట వచ్చిన ఫొటోగ్రాఫర్‌కి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సోమవారం వాహన యజమాని ఎండీ.అక్రమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీన పాయకరావుపేటలో జరిగిన వివాహ కార్యక్రమాన్ని వీడియో షూటింగ్ తీసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చానని అక్రమ్ తెలిపారు. తన వాహనాన్ని పట్టణంలోని మంగవరంరోడ్డులోని యర్రా తమ్మయ్యవీధిలో పార్కు చేశానన్నారు. వివాహం వీడియో షూటింగ్ పూర్తిచేసుకుని 22వ తేదీ ఉదయం వచ్చి చూడగా పార్కింగ్ చేసిన చోట తన వాహనం లేకపోవడంతో ఎదురుగా ఉన్న ఇంట్లోని సీసీ కెమెరాలో చూడగా 21వ తేదీ తెల్లవారుజాము 3.20 గంటలకు గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారని, వారిలో వెనుక కూర్చున్న వ్యక్తి తన వాహనం హ్యాండిల్ లాక్ పగులగొట్టి తీసుకుపోయినట్టు రికార్డు అయ్యిందన్నారు. దీనిపై పాయకరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు అక్రమ్ తెలిపారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌పై తప్పుడు ప్రచారం, పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, ముల్లేటి ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యక్తిగత దూషణలుతో పాటు కూటమి పాలనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ అప్పలనాయుడుకు సత్కారం



మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను సత్కరించిన పల్లపువీధి యువకులు

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన సూరిశెట్టి అప్పలనాయుడును పలువురు యువకులు సోమవారం సత్కరించారు. స్థానిక పల్లపువీధి వినాయక మందిరం వద్ద కమిటీ సభ్యులు వేగి కృష్ణ, ఆడారి కాశీబాబు, వేగి శ్రీను, సూరిశెట్టి దుర్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించే భాగంగా ఎ.జగన్నాథపురం ఫీడర్‌లో యద్రవరం వద్ద విద్యుత్ స్తంభాలను మారుస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల ఫీడర్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఆయన తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సావిత్రి

ఎలమంచిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలపై పట్టణ ఎస్ఐసావిత్రి అవగాహన కల్పించారు. సోమవారం హెచ్ఎం వైవీ.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా సత్ప్రవర్తనతో ఉపాధ్యాయులు బోధించే వాటిని అర్థం చేసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని బయ్యవరంలో గ్రామస్థులకు చట్టాలపై రూరల్ ఎస్ఐ ఉపేంద్ర అవగాహన కల్పించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

▸ ఎస్ఐ పి.ప్రసాదరావు

మునగపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మండలంలో అరబుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. చదువుతో పాటు పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సులు కండిషన్‌లు, లైసెన్స్ వంటి అంశాల్లో కూడా నిబంధనలు పాటించాలన్నారు.



అరబుపాలెంలో మాట్లాడుతున్న ఎస్ఐ పి.ప్రసాదరావు

తంగేడు ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యులు, సిబ్బందితో సమీక్షిస్తున్న డీపీఎంవో ప్రశాంతి

కోటవురట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేడు ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ లీడర్, డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు హెల్త్ సెంటరులో రికార్డులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల రక్తపరీక్షల రిపోర్టులను పరిశీలించారు. తంగేడులో ఎంతమంది గర్భిణులున్నారు.. వారిలో ఎంతమందికి కాన్పులు జరిగాయన్న అంశంపై ఆరా తీశారు. అనంతరం గర్భిణుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధి సర్వే చేస్తున్నారా లేదా గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది పనితీరుపై గ్రామస్థులను విచారించారు. విద్యార్థులకు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారని బదులిచ్చారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎస్‌వో రామచంద్ర, డీపీవో జగదీష్, జనార్దన్, డాక్టర్ సంతోష్, డాక్టర్ ప్రత్యూష్, డాక్టర్ మౌనిక్, ఎంపీహెచ్‌వో బెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో 'పీలా' వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా వేదికకు రాష్ట్ర అర్బన్, ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంటరు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలువురితో మట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి ఆయా శాఖల అధికారులకు పంపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు : ఏడీ



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం

పరవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చునని అనకాపల్లి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సుబ్రహ్మణ్యం అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో సోమవారం తానాం గ్రామంలో రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. భూసారం వల్ల భూమిలో వానపాముల సంఖ్య పెరిగి భూమిని గుల్లపరుస్తుందని తద్వారా వానపాములు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారిణి ఎం.రమాదేవి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం గురించి వివరించారు. రైతులంతా ఈ-పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, ఏపీ ఎంబీపీ, ఎంఐఏట రంజిత, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పుష్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖోకు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని



లాస్యను అభినందిస్తున్న ఎంఈఓలు లక్ష్మణరావు, తిరుపతిరావు, హెచ్ఎం

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కూండ్రపు లాస్య ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఆర్.ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాస్థాయి అండ్-17 బాలబాలికల ఖోఖో పోటీలు జరగ్గా అద్భుతంగా రాణించి లాస్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, హెచ్ఎం ఆర్.ప్రసాద్, సిబ్బంది అభినందించారు. స్కూల్ కమిటీ ఛైర్మన్ శంకరరావు, వైస్ ఛైర్మన్ జ్యోతి, పీడీలు అబ్దుల్ రెహమాన్, రత్నాలమ్మ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్సు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్నారావు

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికులకు హెల్త్ అలవెన్సు వెంటనే అమలు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.చిన్నారావు డిమాండ్ చేశారు. ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. జూన్‌లో ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్‌లకు నెలకు రూ. నాలుగు వేలు హెల్త్ అలవెన్సు కింద ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసినా, దీనిని జిల్లాలో అనేక పంచాయతీలు అమలు చేయకపోవడం విచారకరమన్నారు. అలవెన్సుల కోసం అడిగితే నిధులు లేవని కుంటిసాకులు చెబుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులతో సమానంగా గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్నారని, అటువంటప్పుడు జీతాలు అందుకు అనుగుణంగా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. తక్షణమే హెల్త్ అలవెన్సులు అన్ని పంచాయతీల్లో అమలు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ఎం.అప్పలరాజు, అప్పారావు, రావాడ కనకమహాలక్ష్మి, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం



సాయి తనూజ్.. (ఫైల్)

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాల శారదా నదిలో గల్లంతైన విద్యార్థి మృతదేహం సోమవారం మధ్యాహ్నం బయటపడింది. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఘటనా ప్రాంతంలో గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది విద్యార్థి ఆచూకీ కోసం వెతికారు. మధ్యాహ్నం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు నదిలోకి దిగి విద్యార్థిని వెతికేందుకు సిద్ధమవుతున్న సమయంలో అతడి మృతదేహం బయటపడిందని పట్టణ ఎస్ఐ కె.సంతోష్ కుమార్ తెలిపారు. గోపాలపట్నంలో నివాసముంటున్న సాయి తనూజ్ ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. పదో తరగతి బ్యాచ్ ఎనిమిది మంది సరదాగా పిక్నిక్ అని వచ్చారన్నారు. నది ఒడ్డున ఆడుతుండగా బాలు నదిలో పడటంతో బాలు కోసం సాయితనూజ్ దిగగా మునిగిపోతున్న సమయంలో లక్ష్మణ్ అనే మరో విద్యార్థి కాపాడటానికి దిగి అతను కూడా ప్రమాదంలో చిక్కుకున్నారు. ఇది చూసి సమీపంలో ఉన్న మత్స్యకారులు లక్ష్మణ్‌ను రక్షించారన్నారు. ఒక్కగానొక్క కొడుకుని శారదానది పొట్టన పెట్టుకోవడంతో తల్లి, కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలోకి మునిగిపోయారు.

మరమ్మతులు చేపట్టి ఏడాది గడవక ముందే..

▸▸ అధ్వానంగా సింహాద్రి ఎన్టీపీసీ ప్రధాన రహదారి ▸▸ ఇబ్బందులు పడుతున్న వాహనదారులు ▸▸ తరచూ ప్రమాదాలు





ఊటగెడ్డ కూడలి నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



పరవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ఊటగెడ్డ కూడలి నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేపట్టి ఏడాది కాకముందే గుంతలు ఏర్పడటంతో వాహనచోదకులు మండి పడుతున్నారు. ఇదే రహదారి గుండా సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నునపర్తి, తంతడి పంచాయతీలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. పరిమితికి మించి బొగ్గు లోడుతో ప్రయాణిస్తున్న లారీలు కూడా ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారిపై గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆదమరిచి ప్రయాణిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతుకు చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

బాలలు, వృద్ధుల సంరక్షణకు కృషి చేయాలి

▸▸ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయండి : ఎస్పీ



ఉత్తమ సేవలందించిన మహిళా కార్యదర్శులను అభినందిస్తున్న ఎస్పీ

అనకాపల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మహిళలు, బాలలు, వృద్ధులు సురక్షితంగా ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. ఇక్కడి జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తమ మండలాల్లో మిస్సింగ్ మహిళల వివరాలను సేకరించి, గుర్తించి పోలీసులకు తెలియజేయాలన్నారు. మిస్సింగ్ కేసులకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్- మొబైల్ ధ్రువీకరణ వంటి అంశాలను ఆన్‌లైన్‌లో వెరిఫై చేయాలన్నారు స్పష్టం చేశారు. బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని, ఏ అనుమానం వచ్చిన వెంటనే ఎస్‌హెచ్‌వోలకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎన్‌డీపీఎస్ నియంత్రణ- అసాంఘిక కార్యకలాపాల పై పోలీసులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో అత్యుత్తమ సేవలందించిన మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, ల గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలపై వీఆర్ఏల నిరసన



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో వీఆర్ఏలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి చేస్తున్నారన్నారు. గత తొమ్మిదేళ్లుగా వీఆర్ఏలకు వేతనాలు పెంచలేదని, డీఏను కూడా నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు సంబంధం లేని విధులు వేస్తున్నారని వాపోయారు. నైట్ వాచ్‌మెన్, అటెండర్ పదోన్నతుల్లో 70 శాతం వీఆర్ఏలతో భర్తీ చేయాలని, వీఆర్ఓల ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగాధర్, శాంతి, శ్రీను, లోవరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల కోసం ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐద్వా ప్రతినిధుల ఆందోళన

పరవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా టిడ్కో, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో అద్దెకు ఉంటున్న అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. చాలా మంది పేదలు ఇంటి అద్దె కట్టలేని స్థితిలో ఉన్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇంటి స్థలాలు తొందరగా మంజూరు చేయాలన్నారు. అలాగే ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం మూడు సెంట్ల స్థలంతో పాటు రూ. ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కార్యాలయం లోపల పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ అన్నపూర్ణ, సీత, కె.లక్ష్మి, అబద్ధం, సీతమ్మ, బేగం, వెంకటలక్ష్మి, రాజకుమారి, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగి మృతిపై కొవ్వొత్తులతో నిరసన

▸▸ నిజాల నిగ్గు తేల్చాలని ఆందోళనకారులు పట్టు



నెహ్రూచౌక్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ సచివాలయ ఉద్యోగి మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించి నిజనిజాలు బయట పెట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని నెహ్రూచౌక్‌లో సోమవారం రాత్రి ఏపీఎన్‌జీజీవో సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన చేపట్టారు. ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు, వివిధ విభాగాల ఉద్యోగులు అధికసంఖ్యలో హాజరై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీఎన్‌జీజీవో అడహక్ కమిటీ ఛైర్మన్ పీలా సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల్లో నెలకొన్న ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. దర్యాప్తును వేగవంతం చేసి బాధ్యులను బదిలీ చేయాలని పట్టుబట్టారు. పారదర్శకంగా నిజాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. తొమ్మిదవ సచివాలయం వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ఎం. నూకరాజు అధికారుల మానసిక ఒత్తిడి వలనే చనిపోయారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వీవీ శ్రీనివాసరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1975 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం పట్టణంలో విద్యార్థినీ విద్యార్థులకు పెయింటింగ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. డిసెంబరు ఆరు, ఏడు తేదీల్లో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరు ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఎయిర్ పొల్యూషన్, సేవ్ గర్ల్ చైల్డ్ అంశాలపై పోటీలను నిర్వహించారు. సుమారు 130 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో ప్రతి పాఠశాల విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నామని గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, కార్యదర్శి మళ్ల లోకేష్, కోశాధికారి రాపేటి నారాయణరావు తెలిపారు. ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత, ప్రముఖ డ్రాయింగ్ టీచర్ బొడ్డేడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. విజేతలకు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పెదముషిడివాడ రోడ్డులో ప్రమాదకర మలుపులు





సంత సమీపంలో రహదారిపై మలుపులు

లంకెలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి నుంచి సబ్బవరం వెళ్లే ప్రధాన రహదారి పెదముషిడివాడ వద్ద గల మలుపులు ప్రమాదకరంగా మారాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద, వారపు సంత సమీపంలో అధికంగా మలుపులు ఉండడంతో తరుచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపులు యూ ఆకారం, ఎల్ ఆకారాల్లో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పెదముషిడివాడ, గండివానిపాలెం, విజయరాంపురం, నక్కవానిపాలెం, పచ్చిగోరువానిపాలెం, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు లంకెలపాలెంతో పాటు మండల కేంద్రమైన పరవాడ రావాలంటే ఈమార్గంలోనే ప్రయాణించాల్సి ఉంది. ఇక్కడ మలుపులు సూచించే హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈరహదారిలో మలుపులకు తోడు వీధిలైట్లు లైట్లు లేకపోవడంతో ఇటుగా ప్రయాణించాలంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భోగలింగేశ్వరుడ్ని దర్శించుకున్న ఐఏఎస్ అధికారి దంపతులు



అధికారికి జ్ఞాపిక అందిస్తున్న ఛైర్మన్ సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం కోట మీద గల సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామిని ఐఏఎస్ అధికారి యల్లపు వరహ వెంకట జయరాజశేఖర్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అనకాపల్లికి చెందిన ఈయన ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర స్టాఫ్ సెలక్షన్ స్థాయి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆలయ ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ దగ్గరుండి దర్శనం చేయించి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు పేరూరి చిన్నస్వామితో పాటు మాజీ కౌన్సిలర్ కర్రి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గౌరీ గ్రంథాలయంలో ఉచిత సంగీత శిక్షణ

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం నిదానందొడ్డిలోని గౌరీ గ్రంథాలయంలో సోమ, బుధ, శుక్రవారాల్లో సంగీతపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కర్ణాటక సంగీతంపై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. వారానికి మూడు రోజుల పాటు సాయంత్రం ఐదున్నర నుంచి ఏడు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పదిహేనేళ్ల పైబడిన బాలికలు, బాలురు ఈ శిక్షణకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గలవారు గ్రంథాలయానికి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

బవులవాడలో 'రైతన్న మీ కోసం'



రైతులతో మాట్లాడుతున్న రంగాచారి, రైతులు

తుమ్మపాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం బవులవాడలో సోమవారం రైతన్న 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ, పశు సంవర్ధక, గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామంలో గల రైతుల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచిచారు. మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి మాట్లాడుతూ రానున్న సీజన్‌లో నీటి ఆధారిత పంటలను పండించాలన్నారు. ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయ్, వ్యవసాయ సిబ్బంది అప్పలరాజు, సత్యారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ లోడు లారీకి రూ. 48 వేలు జరిమానా

అనకాపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద ఐరన్ గడ్డర్‌ను ఢీకొని పరారైన క్వారీ లారీని ట్రాఫిక్ పోలీసులు సోమవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. అధిక బండరాళ్ల లోడుతో వెళ్లిన రాజమండ్రికి చెందిన లారీని రవాణా శాఖ అధికారుల వద్ద పెట్టగా అధికారులు రూ.48వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు. అనంతరం లారీని ఆర్‌పీఎఫ్‌కు అప్పగించామన్నారు. ఇదిలావుంటే, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ బండరాళ్లతో రైల్వే గడ్డర్‌లను ధ్వంసం చేస్తున్న లారీలపై అధికారులు వారం రోజుల్లో తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం ఆయన అండర్‌బ్రిడ్జి వద్ద జరిగిన సంఘటనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన వద్ద రెండోసారి తెల్లవారుజామున ప్రమాదం చోటు చేసుకోవడం విచారకరమన్నారు. భారీ లోడుతో వెళ్తున్న లారీలు గడ్డర్‌లను ఢీకొనడంతో రైల్వే ట్రాక్‌కు ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మార్చి నెలలో ఇలాంటి సంఘటన జరగడం వల్ల రైల్వే ట్రాక్ దెబ్బతిందన్నారు. ఎంపీ సీఎం రమేష్ చొరవతో తాను దగ్గరుండి ట్రాక్ మరమ్మతులు పర్యవేక్షించడం జరిగిందన్నారు. అలాంటి సంఘటనే మరలా పునరావృతం కావడం దురదృష్టకరమన్నారు.



కుట్టు మిషన్ అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన డీఆర్‌డీఏ పీడీ మురళీ

సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలికి చేయూత

పాడేరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న కొయ్యూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ సరమండ లక్ష్మికి జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం కుట్టుమిషన్‌ను అందించారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలైన తన జీవనోపాధికి అవకాశం కల్పించాలని లక్ష్మి జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఆమె అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ స్వయంగా కుట్టుమిషన్‌ను అందించారు. దీంతో కలెక్టర్‌కు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళీ, వెలుగు డీపీఎం (ఫైనాన్స్) వీవీ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో మెరుగ్గా రాణించాలి



విద్యార్థికి ఆర్థిక సమాయం అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అరుణాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ విలువిద్య పోటీల్లో మరింత మెరుగ్గా రాణించి అల్లూరి జిల్లాకు వన్నె తేవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఆకాంక్షించారు. స్థానిక మోదమాంబ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న సీహెచ్.మోహిత్ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ విలువిద్య పోటీల్లో పాల్గొని రెండో స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం ఈటానగర్‌లో ఈ నెల 28 నుంచి జరిగే పోటీల్లో పాల్గొనేందుకు విలువిద్య క్రీడా విద్యార్థి మోహిత్ సాయికి సోమవారం జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శనలు కనపరిచి రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహన్‌రావు, కోచ్ సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

సీలేరు మీదుగా ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరణ

సీలేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల నిరసన దినం నేపథ్యంలో సీలేరు మీదుగా రద్దు చేసిన అన్ని డే అండ్ నైట్ సర్వీసులను సోమవారం నుంచి పునరుద్ధరించినట్టు ఆర్టీసీ విశాఖపట్నం డిపో మేనేజర్ మాధురి తెలిపారు. అలాగే విశాఖపట్నం డిపో నుంచి సీలేరు మీదుగా భద్రాచలం నడిపే బస్సులను కండీషన్‌లో ఉన్నవాటినే పంపుతున్నామని, అయితే ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉన్న రహదారి దారుణంగా ఉండడంతో బస్సులకు సాంకేతిక లోపం తలెత్తుతోందని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

బాలికల భవిష్యత్తుకు విద్యే రక్షణ కవచం



మాట్లాడుతున్న సీడీపీవో బాలమణిదేవి, పక్కన ఏటీడబ్ల్యూవో, తహసీల్దార్

జి.మాడుగుల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికల భవిష్యత్తుకు విద్యే సరైన రక్షణ కవచమని సీడీపీవో బాలచంద్రమణిదేవి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన బేటీ బచావో-బేటీ బడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల పరిరక్షణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. బాల్యవివాహాలు, లైంగిక దాడులు, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్‌కుమార్, ఏటీడబ్ల్యూవో నాగశిరిషా, వైద్యాధికారిణి ఇందిర పాల్గొన్నారు.

సీలేరులో హీరో రవితేజ సినిమా చిత్రీకరణ



ఇంటెక్ డ్యాం సమీపంలో ఎంబాక్‌మెంట్ వద్ద సినిమా చిత్రీకరిస్తున్న దృశ్యం

సీలేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీకే వీధి మండలం సీలేరులో సోమవారం సినిమాను చిత్రీకరించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై శివ నిర్వాణ దర్శకత్వంలో హీరో రవితేజ, హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ నటిస్తున్న సినిమాకు మారెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ముహూర్తపు షాట్‌ను తీశారు. అనంతరం తొలి షాట్‌ను ఇంటెక్ డ్యాం, ఎంబాక్‌మెంట్, రెగ్యులేటర్ డ్యాం, గుంటవాడ జలాశయం వద్ద హీరో రవితేజ, బేబీ నక్షత్రలపై చిత్రీకరించారు. ఈ సినిమాలో సాయికుమార్, జగపతిబాబు కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్టు చిత్రం యూనిట్ వర్గాలు తెలిపాయి. సినిమా షూటింగ్ చూడడానికి సీలేరు, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

ఇళ్ల లబ్ధిదారులకు జియో ట్యాగింగ్



గిరిజన లబ్ధిదారుకు జియో ట్యాగింగ్ చేస్తున్న ఏఈఈ లక్ష్మి విమల

గూడెంకొత్తవీధి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పక్కా గృహాల లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేయించుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఏఈఈ పసుపులేటి లక్ష్మి విమల సూచించారు. మండలంలోని దామనాపల్లి గ్రామంలో సోమవారం పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి స్థలాన్ని జియో ట్యాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకంలో పీవీటీజీలకు పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. తాజాగా ప్రభుత్వం ఇతర కూలాలకు చెందిన గిరిజనులకు పక్కా గృహాలు మంజూరు చేస్తుందన్నారు. గృహాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి స్థలాలను జియోట్యాగింగ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించుకోవాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులు గృహాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పెసా ప్రధాన కార్యదర్శి ఎం.చంటిబాబు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు లాభదాయకం

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు తిరుమలరావు



సీఎం చంద్రబాబు ప్రసంగం ప్రతులను రైతులకు అందజేస్తున్న ఏడీఏ

చింతపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు బీవీ తిరుమలరావు చెప్పారు. చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో సోమవారం రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సీఎం నారా చంద్రబాబు ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీక్షించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ గిరిజన ప్రాంతం పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయానికి అనుకూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆర్గానిక్ హబ్‌గా ప్రకటించిందని చెప్పారు. ఈ నేపథ్యంలోగిరిజన రైతులు పంటలన్నీ సేంద్రియ పద్ధతిలోనే సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తుందన్నారు. పంటలకు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడరాదన్నారు. సేంద్రియ పద్ధతిలో ఘనజీవామృతం, ద్రవ జీవామృతం వినియోగించాలన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నిధులను ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం రైతులకు సీఎం చంద్రబాబు ప్రసంగం పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు, సర్పంచ్ లలిత, అభ్యుదయ రైతు కె.కరుణానిధి, వీఆర్వో పద్మ పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు వీఆర్‌ఏల నిరసన



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటినా హామీలు అమలు చేయలేదన్నారు. సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని వివరించారు. వీఆర్‌ఏలకుపే స్కేల్ అమలు చేయాలని, అర్హులకు రికార్డుఅసిస్టెంట్‌లుగా పదోన్నతలు కల్పించాలని, ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో ఏవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు సింహాచలం, రామకృష్ణ, నీలకంఠం, కృష్ణంరాజు, సత్తిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై ఆందోళన కార్యక్రమం చేపట్టారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్షలోని వివిధ విభాగాల్లో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్ఎమ్‌టీలు, పార్ట్ టైం ఇంస్ట్రాక్టర్లు, కేజీబీవీలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, మెసెంజర్లు, భవిత సెంటర్లలోని 700 మంది సిబ్బంది సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, విద్యా శాఖలో విలీనం చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ అందించాలని, హెచ్‌ఆర్‌ఏ, డీఏను అమలు చేస్తూ వేతనాలు చెల్లించాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, పార్ట్‌టైం విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమకు వర్తింపచేయాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎ.అనంత లక్ష్మి, ప్రధాన కార్యదర్శి వి.జయరాజు, కోశాధికారి పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక లాభాలు



'రైతన్న మీకోసం'లో మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యంతో అధిక లాభాలు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి మురళీ కృష్ణ తెలిపారు. మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల వివరాలు, ప్రస్తుత దిగుబడులు, పంట మార్పిడి ద్వారా కలిగే అధిక ఆదాయం గురించి వివరించారు. ఉద్యాన పంటలైన కాఫీ, పసుపు, పండ్లు, కూరగాయలు తదితరాల సాగుపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్స్ సమస్య పరిష్కరించాలని పీవోకు వినతి

హుకుంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అడ్డుమండ సచివాలయ పరిధిలో సెల్ సిగ్నల్ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి శ్రీపూజకు పలువురు గ్రామస్థులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం పాడేరుకు ఐదు కిలోమీటర్ల దూరంలో అడ్డుమండ సచివాలయం ఉన్నా సిగ్నల్ సరిగా అందకపోవడం దారుణమన్నారు. ఈ కారణంగా ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారికి జాబితా నమోదు తదితరాలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్టు చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో సన్యాసంపాలెం అడ్డుమండ ప్రజలు ఉన్నారు.

'పశు సంపద వృద్ధితో రైతుల జీవన ప్రమాణాలు మెరుగు'

అనంతగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పశు సంపద వృద్ధి ద్వారా పాడి రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జయరాజ్ తెలిపారు. మండలంలోని కొత్తూరు పంచాయతీలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి సంపద సంరక్షణకు పలు సూచనలు చేశారు. వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, ఆరోగ్య శిబిరాలు, జాతీయ ఉపాధిహామీ పథకంలోని మేలైన పశుగ్రాసాల సాగు, మినీ గోకులు, పశు బీమా తదితరాలపై వివరించారు. ఈ కార్యక్రమంలోని అరకు ప్రాంతీయ పశువైద్యశాల సంచాలకుడు డాక్టర్ శ్రీనుబాబు, కాశీపట్నం పశువైద్యాధికారి డాక్టర్ సాగిరి గణేశ్వరరావు, సర్పంచ్ సీతయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'దశలవారీగా అభివృద్ధి పనులు'

ముంచంగిపుట్టు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు సర్పంచ్ కె.త్రినాథ్ తెలిపారు. తుమిడిపుట్టు పంచాయతీ నిధులతో ఐదు లక్షల రూపాయలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. పంచాయతీ నిధులు వెచ్చించి సుమారు వంద మీటర్ల డ్రైనేజీ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు వి.సాధురాం, బి.విక్రమ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో గ్రమస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

అనంతగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీనబాడు పంచాయతీ పరధిలో గల జలాశయంలో గల్లంతైన గాలి అప్పలరాజు, డెబర రమేశ్, అలాగే, మృతిచెందిన జీవన్ కుటుంబాలను సోమవారం టీడీపీ నాయకులు పరామర్శించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర సానుభూతి తెలిపారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.ఐదు వేలు చొప్పున మూడు కుటుంబాలకు 15వేల ఆర్థిక సాయం అందించారు. ప్రమాదం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి, అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నాయకులు దేముడు, బి.లక్ష్మణ్‌రావు, నిర్మల, నూకరాజు, చంటి, గణేశ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు విజయవంతం



విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎంలు

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల సోమవారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గిరిజన సంక్షేమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, జీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 21 నుంచి 23వ తేదీ వరకు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలకు విజేతలను తీసుకు వెళ్తామని వారు తెలిపారు.

కేజీబీవీలో అక్రమాలపై కొనసాగుతున్న విచారణ

» విచారణకు హాజరుకాని ఎస్‌వో, అకౌంటెంట్

కొయ్యూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేంద్రపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అక్రమాలపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 21న సరుకులు అక్రమంగా తరలిస్తూ ఎస్‌వో పట్టుబడిన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశించడంతో ఈ నెల 22న సర్వశిక్షా అభియాన్ జీసీడీవో కల్పన ప్రాథమిక విచారణ జరిపారు. దీనిపై సోమవారం సర్వశిక్షా అభియాన్ రీజనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మరోమారు విచారణ జరిపారు. రెండు గదుల్లో 15 బస్తాల బియ్యం అక్రమంగా నిల్వ చేయడాన్ని గుర్తించారు. ఈ విషయమై సంబంధిత బీసీ వెల్ఫేర్ సిబ్బంది స్వామినాయుడు విచారించగా, విచారణ ముగిసే వరకు బియ్యం బస్తాలను దాచాలని ఎస్‌వో పరిమళ చెప్పారని వారు వెల్లడించారు. అయితే విచారణకు హాజరుకాకుండా ఎస్‌వో పరిమళ, అకౌంటెంట్ విధులకు గైర్హాజరు కావడంతో మరో దఫా విచారణ చేపడతామని స్వామినాయుడు తెలిపారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం : దొన్నుదొర



కొత్తూరులో రైతుకు పత్రం అందిస్తున్న సియ్యారి దొన్నుదొర

అనంతగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు పంచాయతీలో గల పలు గ్రామాల్లో సోమవారం సర్పంచ్ సారా సీతయ్య ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర ముఖ్య అతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం అన్నదాతను మోసం చేస్తే, కూటమి ప్రభుత్వం మేలు చేసి అన్నిరకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. పంటలకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా రైతులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్టు వివరించారు. ముందుగానే సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం పలువురు రైతులకు అన్నదాత సుఖీభవ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ఉపాధ్యక్షులు మజ్జి భీమరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎస్.కృష్ణ మహేశ్, తిరుపతి, సింహాచలం, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ నరంజి ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన లక్ష్మీపేట పంచాయతీ కప్పడ గ్రామంలో పర్యటించారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోవాలని చెప్పారు. అన్నదాద సుఖీభవతో వ్యవసాయం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాంగి సోనే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సంబరాల్లో పెదబయలు విద్యార్థుల సత్తా

పెదబయలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబారాల్లో స్థానిక గిరిజన బాలురు-1 ఆశ్రమ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు హెచ్‌ఎం పండన్న తెలిపారు. పాఠశాలకు చెందిన జి.కృష్ణచైతన్య, కొర్రా పౌల్‌రాజు విజేతలకు గైడ్ ఉపాధ్యాయుడుగా బాలక్రిష్ణ వ్యవహరించగా ఉపాధ్యాయులు పారయ్య, నాగేశ్వరరావు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు హెచ్‌ఎం చెప్పారు.

యూపీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

టీడబ్ల్యు డీడీ పరిమిళ



పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ సర్వీస్ ప్రిలిమ్స్ (యూపీఎస్సీ) పరీక్షకు ఉచిత శిక్షణ కోసం అర్హులైన గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిమిళ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ పూర్తి చేసిన గిరిజన అభ్యర్థులు ఇందుకు అర్హులుగా చెప్పారు. అభ్యర్థుల బయోడేటా, రెండు పాస్ ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలని, రెగ్యులర్ డిగ్రీ అర్హత తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించి, 27న హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులకు ఈ నెల 30న స్క్రీనింగ్ నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు డిసెంబరు 10 నుంచి శిక్షణ తరగతులకు పంపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జాబ్‌మేళాలో 180 మందికి ఉద్యోగాలు

చింతపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 180 మంది విద్యార్థులకు పలు కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. కళాశాలలో సోమవారం ఈ ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన మల్టీనేషనల్ కంపెనీలు ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు చేసినట్టు చెప్పారు. అర్హతల ఆధారంగా 180 మందిని ఎంపిక చేశారన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.కెజియా, కె.సంతోషి, కె.లీలాపావని పాల్గొన్నారు.

పేదలకు సాయపడడంలోనే సంతృప్తి

చింతపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు సహాయ పడడంలోనే సంతృప్తి కలుగుతుందని ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం.పద్మావతి అన్నారు. ఆస్పత్రిలో రోగులకు సోమవారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు వచ్చే జీతంలో 30 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు చందన, వాసవి, రుక్మిణి, లావణ్య, ఫిజియో థెరపిస్టు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల నిర్వహణకు యాప్

గూడెంకొత్తవీధి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల నిర్వహణకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని వెలుగు ఏపీఎం బి.సూర్యారావు తెలిపారు. వెలుగు కార్యాలయంలో యాప్‌పై సోమవారం ఎస్‌హెచ్‌జీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించిందని చెప్పారు. యాప్ వినియోగంపై ఈనారీలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం మండల కేంద్రంలో యాప్‌పై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు మేరి, నాగమణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ పరీక్ష ఫీజు చెల్లింపు, నామినల్ రోల్స్ సమర్పించినపుడు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్ఎస్‌సీ విద్యార్థుల నామినల్ రోల్స్ తయారు చేసేటపుడు వివరాలను యూడీఐఎస్‌ఈలో తనిఖీ చేయాలన్నారు. తప్పులు లేవని నిర్ధారించుకున్న తరువాత వెబ్‌సైట్‌లో పరీక్ష ఫీజులు చెల్లించి అప్లికేషన్ సబ్‌మిట్ చేయాలని వారు తెలిపారు. అప్పటికీ అనుమాను ఉంటే 9908083660, 8978970592, 9110564541 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు తెలిపారు.

సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా నారాయణరావు బాధ్యతలు

సీలేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పసుపులేటి నారాయణరావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో పనిచేసిన మస్తాన్‌వల్లీ, సౌమ్య రెండు నెలలు క్రితం బదిలీపై వెళ్లిపోయారు. కొత్త వైద్యులు జిల్లాకు వచ్చేవరకు సీలేరు పీహెచ్‌సీలో బాధ్యతలు చేపట్టాలని నారాయణరావును డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తి నాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలను స్వీకరించారు.

రక్తదాన శిబిరం విజయవంతం

పాడేరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు ఆసుపత్రి రక్తనిధి బ్యాంకులో సోమవారం ఎస్‌హెచ్‌జే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. 30 మంది యువకులు స్వచ్ఛందంగా రాకా, వారిని బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్రరావు పరీక్షించి 16 మందిని రక్తదానం చేయడానికి ఎంపిక చేశారు. వీరి నుంచి సేకరించిన రక్తాన్ని ఆస్పత్రి నిల్వల కేంద్రానికి అప్పగించినట్టు ఫౌండేషన్ ప్రతినిధి జనపరెడ్డి హర్ష తెలిపారు. ఇంతవరకు తాను 23 సార్లు రక్తదానం చేశానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రక్తదాతలు ఎ.సుధాకర్ నాయుడు, రవి చౌహాన్, కృష్ణ, బాబి, యువరాజ్, నిఖిల్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం మేలు

జి.మాడుగుల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ఎంతో మేలని మాజీ ఐఏఎస్ అధికారి తమర్బ బాబురావు నాయుడు సూచించారు. జీఎం.కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. పసుపు, కాఫీ, మిరియాలు, అల్లం, వంటి అపరాల పంటలు సేంద్రియ పద్ధతిలో పండిస్తే ఆశించిన ధర పలుకుందని ఆయన చెప్పారు. కాఫీ, మిరియాలు జీసీసీకి విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వరప్రసాద్, కూటమి నాయకులు బాలయ్యదొర, సతీశ్‌పడాల్, నాగంనాయుడు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

గూడెంకొత్తవీధి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్వీనగర్ వారపు సంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా సోమవారం ఆదివాసీలు ర్యాలీ చేశారు. మావోయిస్టు ఉద్యమం వల్ల గిరిజనులకు నష్టమే తప్ప లాభం లేదని నినాదాలు చేశారు. మావోయిస్టు ఉద్యమాన్ని నిషేధిస్తున్నట్టు వారు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు

కాపుల సంక్షేమానికి ప్రభుత్వ సహకారం

▸ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాపుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు చెప్పారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన నియోజకవర్గ తూర్పుకాపు సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులంతా సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం డిసెంబరు 14న కాపురాక్స్ తూర్పుకాపు సంఘం ఆధ్వర్యంలో గౌరీపట్నంలో నిర్వహిస్తున్న తూర్పుకాపు వనసమారాధన కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ, ఇతర పార్టీలకు చెందిన తూర్పుకాపు నాయకులు చందు రాంబాబు, పుల్లేటి వెంకటేశ్, నెహ్రూ, నానికుమార్, సేనాపతి శ్రీనివాసరావు, కాపు రాక్స్, శ్రీకృష్ణ దేవరాయ తూర్పుకాపు యువజన సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై పోరాడాలి



ఏఐఎస్ఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

నర్సీపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. విద్యార్థులకు రూ.6500 కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక పోవడం వల్ల ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, నియోజవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర, నిర్మాణ బాధ్యుడు డీసీహెచ్ క్రాంతి, అజయ్, నవీన్, నాగదుర్గ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు నూతన కమిటీలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న జనసేన నాయకుడు దొరబాబు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక ఎన్నికలకు నూతన కమిటీల ఏర్పాటు చేయనున్నట్టు జనసేన పార్టీ నాయకుడు అప్పన దొరబాబు తెలిపారు. మండలంలోని బొడ్డేపల్లి జనసేన కార్యాలయంలో సోమవారం నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఇప్పటి నుంచే కృషి చేయాలని, ఇందుకోసం అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అద్దేపల్లి గణేశ్, దుంపలపాటి సహదేముడు, లంక సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యాదవుల సత్తా చాటాలి

యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బాబూరావు

కె.కోటపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల సత్తా చూపించాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు భరణికాన బాబూరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రం కె.కోటపాడులో సోమవారం మాడుగుల నియోజకవర్గ స్థాయి యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పరంగా అధిక శాతం ఉన్న యాదవ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొందాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో యాదవ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మిగిలిన కులాలను కలుపుకుంటూ రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలని కోరారు. అనంతరం కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల మండలాల కార్యవర్గాన్ని నియోజకవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బీ శ్రీనివాసరావు, నాయకులు భరణికాన నరసింహమూర్తి, కరక సోమునాయడు, పంచదార్ల సూరిబాబు, గజ్జి గంగాధర్, చల్లా నానాజీ, ఎలమంచిలి ధర్మారావు, నంబారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు ఉత్సవం



గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

రావికమతం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమిర గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామంలో ప్రతి ఏటా గౌరీపరమేశ్వరులను నెలకొల్పడం ఆనవాయితీ కావడంతో నెల రోజుల క్రితం ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. అప్పటి నుంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించేవారు. సోమవారంత రాత్రి గ్రామస్థులు ప్రతీ ఇంటి నుంచి అమ్మవారికి భారీగా పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా పలు నేల వేశాలు, కోలాటాలు గ్రామస్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా ఏర్పాటు చేశారు.

సీపీఐతో కలిసి ఉద్యమాలు చేయండి

మావోయిస్టులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య పిలుపు

కృష్ణాదేవిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయే కంటే జనజీవన స్రవంతిలోకి వచ్చేసి సీపీఐతో కలిసి ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో దివంగత సీపీఐ నేత మాకిరెడ్డి రామునాయుడు సంస్మరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామునాయుడు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి, పిల్లల చదువులకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అడవుల్లో ఉన్న అపార సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నదని చెప్పారు. దీనికి అడ్డుగా ఉన్న హిడ్మా వంటి మావోయిస్టులను హతమార్చటమే లక్ష్యంగా బూటకపు ఎన్‌కౌంటర్లు సృష్టిస్తున్నారని, హిడ్మా ఎన్‌కౌంటర్ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యని ఆయన ఆరోపించారు. ఇలా ప్రాణాలు కోల్పోయే కంటే మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి పోరాటాలు చేయాలన్నారు. సీపీఐ జాతీయ నేత జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ రామునాయుడు కుటుంబానికి ఎల్లవేళలా అండంగా ఉంటామన్నారు. మేకా సూరిబాబు స్ఫూర్తితో రామునాయుడు అనేక భూపోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు ఎస్.వెంకట గిరిబాబు, గాదంపాలెం సర్పంచ్ నల్లిబిల్లి శ్రీను, గొలుగొండ వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, సీపీఐ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా నాయకులు రాఘవేంద్రరావు, ఎస్కే రహిమాన్, రాజాన దొరబాబు, బాలేపల్లి వెంకటరమణ, పొట్టిక తస్యనారాయణ, రావు జగ్గారావు, గంగభవాని, దేముడు, రాధాకృష్ణ, భాస్కరరావు, పైడిరాజు, మేకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, పక్కన జేవీ సత్యనారాయణ

మత్స్యకారుల సంపద పెంపునకు కృషి

▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

▸ రైవాడ జలాశయంలో చేప పిల్లల విడుదల

దేవరాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు సంపదను పెంచేందుకు కృషి చేస్తామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. రైవాడ జలాశయంలో సోమవారం 4.28 లక్షల చేప పిల్లలను విడుదుల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైవాడ చేపలకు ఆర్గానిక్ చేపలుగా పేరుందని చెప్పారు.వీటిని కొనుగోలు చేయడానికి ఎక్కు మంది ఆసక్తి చూపుతారన్నారు. మత్సకారులు ఏడాదికి రూ.15 చెల్లించి లైసెన్సు పొందితే రూ.10 లక్షల వరకు బీమా, ఏభై ఏళ్లకు పింఛన్ లభిస్తుందన్నారు. రాయితీపై వాహనాలు, వివిధ రకాల పరికరాలు ఇస్తారన్నారు. పిల్ల దశలో ఉన్నప్పుడు చేపల వేటకు విరామం ఇవ్వాలని ఆయన సూచించారు. చేపల చెరువులు అనధికారికంగా నిర్వహించడం సరికాదని స్పష్టం చేశారు. అలాగే కోళ్ల వ్యర్థాలను చెరువుల్లో వేసి అనైతిక సంప్రదాయాలు పాటిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. మత్సశాఖ సంయుక్త డైరెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ చెరువులు, జలాశయాల్లో చేపలు పెంచడానికి లైసెన్సులు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. 250 మందికి పైగా లైసెన్సు దారులు ఉన్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి పీఎం మత్స్య సంపద యోజన పథకం పూర్తిగా అమలులోకి వస్తుందన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారిణి విజయ, ఎఫ్‌డీవో నాగమణి, జలాశయ డిఈఈ సత్యంనాయుడు, ఎంపీడీవో సువర్ణరాజు, ఎస్ఐ సత్యనారాయణ, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.వెంకటరమణ పాల్గొన్నారు.



రైవాడ జలాశయంలో చేప పిల్లలను వేస్తున్న ఎమ్మెల్యే బండారు

చేప పిల్లల లెక్కలు తారుమారుపై ఆందోళన

దేవరాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయంలో చేప పిల్లల విడుదలకు సంబంధించి లెక్కలు తారుమారు అయ్యాయని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం నాలుగు లక్షల 28 వేల చేప పిల్లలు వేస్తున్నట్టు ప్రకటించి, కేవలం 25 వేల చేప పిల్లలు తీసుకురావడం అన్యాయమని వారు ఆందోళనకు దిగారు. జలాశయంలో సోమవారం చేప పిల్లలను విడిచిపెట్టి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వెళ్లిపోయిన, తరువాత ఒక వ్యాన్‌లో చేప పిల్లలు రావడం పట్ల మత్సకారులకు అనుమానం వచ్చింది. అయితే నాలుగు లక్షల 28 వేలు చేప పిల్లల్లో మూడు లక్షల 28 వేలు శీలావతి, ఒక లక్ష బొచ్చు చేప పిల్లలు వేస్తున్నట్టు మత్స శాఖ అధికారులు నివేదికను ఇచ్చారు. దీంతో చేప పిల్లలు లెక్కించి వేస్తామనడంతో మత్సశాఖ అధికారులు, మత్సకారులు మధ్య వివాదం జరిగింది. లెక్కిస్తేనే జలాశయంలో వేయాలని మత్స్యకారులు పట్టుపట్టారు. దీంతో చేప పిల్లలు లెక్కించడంతో కేవలం 25 వేలు మాత్రమే ఉన్నట్టు తేలింది. దీనికి కోపోద్రిక్తులైన మత్స్యకారులు రైవాడ సచివాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వీరికి సర్పంచ్ చల్లా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ఉగ్రాకల గంగాభవానీ మద్దతు తెలిపారు. దీంతో చేసేది లేక మిషన్ ఫింగర్లింగ్ పథకంలో కట్ల 20 వేలు, రోహు 30 వేలు మొత్తం 50 వేల చేప పిల్లలు వేసినట్టు ఎఫ్‌డిఓ నాగమణి ధ్రువీకరిస్తూ లిఖిత పూర్వకంగా పత్రం ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.



మత్స శాఖ అధికారులు టోకరాపై నిరసన తెలుపుతున్న మత్సకారులు

ఎమ్మెల్యే బండారు అవాక్కు

రైవాడ జలాశయంలో వేసిన చేప పిల్లల లెక్కల్లో తేడాలు ఉండడంపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అవాక్కయ్యారు. దీనిపై సమగ్రమైన విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మిగతా చేప పిల్లలను జలాశయంలో వేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని సోమవారం రాత్రి ఎమ్మెల్యే విలేకరులకు తెలిపారు.

ఘనంగా విజయ్ జన్మదిన వేడుకలు





నర్సీపట్నం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు... గొలుగొండ: జి.కొత్తూరులో విజయ్ పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నర్సీపట్నం/గొలుగొండ/మాకవరపాలెం, నాతవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం నియోజకవర్గ కేంద్రంతో పాటు గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం మండలాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయ్ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. నర్సీపట్నం అబీద్ సెంటర్‌లో పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. 30 అడుగుల భారీ కటౌట్‌కి క్రేన్‌తో పూల దండ వేసి బాణసంచా కాల్చారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. పేదలకు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలతో సోషల్ మీడియా పోటెత్తింది. హ్యాపీ బర్త్‌డే విజయ్ అన్న హ్యాష్ ట్యాగ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలు చెప్పారు.

అలాగే సీఎం చంద్రబాబు ఆశీస్సులను విజయ్ తీసుకున్నారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి పాదాలకు నమస్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కు చంద్రబాబు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. గొలుగొండ మండలంలో విజయ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు కె.రవివర్మ, చిటికెల సాంబమూర్తి, ఎ.గోపాలకృష్ణ, సుర్ల బాబ్జి, జి.సత్యనారాయణ, కౌన్సిలర్లు మధు, కొల్లి రామకృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.



విజయ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు

మాకవరపాలెంలోని తామరం ప్రభాకర్ రాజు ఇంటివద్ద విజయ్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకట చినబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు, ఉపాధ్యక్షుడు కె.చిరంజీవి, నాయకులు సురేశ్, రమణమ్మ, రమణ, నందకిశోర్ పాల్గొన్నారు. నాతవరంలో రక్తదాన శిబిరాన్ని తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ ప్రారంభించారు. వెదురుపల్లిలో విద్యార్థులకు పారుపల్లి చినబాబు స్వెటర్లు పంపిణీ చేశారు. నాయకులు ఎన్.వెంకటరమణ మాణిక్యం, పి.సూరిబాబు, విజయ్‌కుమార్, కె.నూకరాజు, పి.దాసు, బి.సూరిబాబు సీతారామ్మూర్తి, శెట్టి లోవ, గోపీ, వెంకటరమణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

చేపల పెంపకందారులపై చర్యలు తీసుకోండి

మాకవరపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాపయ్యవాని చెరువులో ప్రైవేటు వ్యక్తులు చేపల పెంపకంపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో ఎంపీడీవో చాయిసుధకు ఫిర్యాదు చేశారు. గ్రామం పరిధిలో సేకరించిన చెత్తను వెలమ సామాజిక శశ్మాన వాటికలో వేసి, సదరు స్థలాన్ని దుర్గంధభరితంగా మారుస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పాపయ్యవాని చెరువులో పెంచుతున్న చేపలను, చెరువు గట్టున పెరిగిన కొబ్బరి చెట్ల కాయలను బహిరంగ వేలం ద్వారా ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై ఇప్పటికే పలు మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్వో ప్లాంట్ మరమ్మతు

నర్సీపట్నం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మార్కెట్ యార్డులో ఆర్వో ప్లాంట్‌ను డైరెక్టర్ వెంకటకృష్ణారావు మరమ్మతులు చేపట్టారు. దీంతో సోమవారం రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పుట్టినరోజు సందర్భంగా నర్సీపట్నం మార్కెట్ సముదాయంలో చైర్మన్ గవిరెడ్డి రమణ ప్రాంభించారు. ఇక్కడ ప్లాంటు గత ప్రభుత్వం హయాంలో మరమ్మతులకు గురైందన్నారు. దీంతో మరమ్మతులు చేపట్టి ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కన్నయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వెబ్‌ల్యాండ్‌లో ఉర్లలోవ భూముల నమోదుకు రీ సర్వే



ఉర్లలోవ డి.పట్టాదారుల భూముల రీ సర్వే ప్రారంభించిన రెవెన్యూ అధికారులు

రావికమతం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వి.మాడుగుల-రావికమతం మండలాల సరిహద్దులో ఉన్న ఉర్లలోవ రెవెన్యూలో నిరుపేదలకు ఇచ్చిన డి.పట్టా భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసేందుకు ఎట్టకేలకు సోమవారం అధికారులు రీ సర్వే మొదలు పెట్టారు. ఉర్లలోవ సర్వే నెంబరు 55లోని సుమారు 345 ఎకరాల ప్రభుత్వ భూమిలో జీడి మామిడి తోటలను సాగు చేసుకుంటున్న రెండు మండలాల్లో పలు గ్రామాలకు చెందిన పేద రైతుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లోనమోదు చేయలేదు. దీంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని వారు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. జాయింట్ కలెక్టర్ స్పందించ సమగ్ర సర్వే చేస్తున్నారు. రైతుల సమక్షంలోనే చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయంపై అవగాహన

కె.కోటపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ చెప్పారు. మండలంలోని కేజే పురంలో సోమవారం ఇంటింట సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రైతు కుటుంబాలను కలిసి వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలు, పథకాలను వివరిస్తామన్నారు. వ్యవసాయం గిట్టుబాటు దశగా వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన చెప్పారు.

గ్రామాల్లో 'రైతన్న సేవలో ప్రభుత్వం'

నర్సీపట్నం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రైతన్న సేవలో ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. చెట్టుపల్లి గ్రామంలో వ్యవసాయాధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రైతన్న సేవలో ప్రభుత్వంపై ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనసేన నాయకుడు ఊడి చక్రవర్తి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు వివరించాలన్నారు. పాడి, ఉద్యావన పంటల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంపై ప్రచారం సాగించాలన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి రైతన్న సేవలో ప్రభుత్వంపై ప్రచారం సాగించారు. గొలుగొండ, జోగంపేట, పాకలపాడు, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, అమ్మపేట గ్రామాల్లో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి రమేశ్‌బాబు సూచించారు. మండలంలో గుడ్డిప, జెడ్.కొత్తపట్నం, దొండపూడి గ్రామాల్లో సోమవారం రైతన్న కోసం ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా రైతుల ఇళ్లకు సిబ్బంది వెళ్లి రైతుభరోసా, పీఎం కిసాన్, రాయితీపై అందించే ఎరువులు, విత్తనాల గురించి వివరించారు. వ్యవసాయం సాగు చేసే ప్రతీ రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఈ సందర్భంగా ఏవో సూచించారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతన్న కోసం ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వ్యవసాయాధికారి డి.అప్పారావు తెలిపారు. చంద్రయ్యపాలెం, బూరుగుపాలెం, గిడుతూరు తదితర గ్రామాల్లో సోమవారం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభి స్తామని చెప్పారు. రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే ప్రభుత్వ అనుబంధ సంస్థలు అందించే రాయితీలు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

చీడికాడలో...

చీడికాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతన్న కోసం ప్రభుత్వం కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి ఎ.కృష్ణవేణి, పశువైద్యాధికారి కేవీఎస్.రాఘవమ్మ కోరారు. చీడికాడలో సోమవారం ఇంటింటికీ వెళ్లి రైతులకు వ్యవసాయానికి సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన ఐదు సూత్రాలను వారికి వివరించారు. మంచాల గ్రామంలో మాజీ సర్పంచ్ కె.శ్రీరామ్మూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం మండల నూతన కార్యవర్గం

రోలుగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘం మండల అధ్యక్షుడిగా జీఎస్ఆర్ స్వామి, ఉపాధ్యక్షుడిగా ఎం.పరమానందంను, కార్యదర్శిగా ఎస్.కుమారి, సహాయ కార్యదర్శిగా కె.రాము, కోశాధికారిగా యు.గోవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ప్రతినిధులను తహశీల్దార్ నాగమ్మ అభినందించారు.

మాకవరపాలెం కార్యవర్గం..


మాకవరపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. సంఘం మండల అధ్యక్షురాలుగా దేవకాంతం, ఉపాధ్యక్షుడిగా చిట్టినాయుడు, కార్యదర్శిగా నాగమణి, సహాయ కార్యదర్శిగా చిరంజీవి, కోశాధికారిగా సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని తహశీల్దార్ బి.వెంకటరమణకు, రెవెన్యూ సిబ్బంది అభినందిచారు.

నాతవరం అధ్యక్షుడిగా కృష్ణశేషులు

నాతవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా బి.కృష్ణశేషులు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా యు.హరిబాబు, కార్యదర్శిగా సిహెచ్.రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఉషారాణి, కోశాధికారి పి.మాణిక్యాలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

న్యాయవాది చప్పా మూర్తి మృతి

చోడవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎడ్లవీధిలో నివాసం ఉంటున్న న్యాయవాది చప్పా మూర్తి (55) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మూర్తి సోమవారం తుది శ్వాస విడిచారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ సీనియర్ నాయకులు గూనూరు మల్లునాయుడు, స్థానిక నాయకులు గొర్లె సుధాకర్, ఈర్లె శ్రీనివాస్, బార్ అసోసియేషన్ న్యాయవాదులు మూర్తి కుటుంబాన్ని పరామర్శించారు.



చప్పా మూర్తి (ఫైల్ ఫొటో)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారువ ఫీడర్ పరిధిలో నాలుగు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. సరఫరాను మరింత మెరుగుపర్చే పనుల్లో భాగంగా వెంకటరాజపురం, తెనుగుపూడి, గర్సింగి, చినగంగవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఆర్టీసీలో 24 మంది ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతుల పత్రాలు చూపిస్తున్న ఆర్ ఎం, డీసీటీఎం

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 24 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 16 మంది అసిస్టెంట్ డిపో క్లర్కులను డిపో క్లర్క్‌లుగా, 8 మందికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-3లుగా పదోన్నతులు కల్పించారు. విశాఖపట్నం, మద్దిలపాలెం, వాల్తేరు, మధురవాడ, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు డిపోల్లో వీరిని నియమించారు. ఈ మేరకు సోమవారం ఆర్‌ఎం కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ అంకిత భావంతో వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీటీఎం కె.పద్మావతి, పీవో జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలికి చేయూత

▸ జీవనోపాధికి కుట్టుమిషన్ అందించిన కలెక్టర్



కుట్టుమిషన్ అందిస్తున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, పక్కన డీఆర్‌డీఏ పీవో మురళీ

పాడేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న కొయ్యూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సరమండ లక్ష్మి అనే గిరిజన మహిళకు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సోమవారం కుట్టుమిషన్‌ను అందించారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలైన తన జీవనోపాధికి అవకాశం కల్పించాలని సరమంగ లక్ష్మి జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఆమె అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆమెకు కుట్టుమిషన్‌ను స్వయంగా అందించారు. దీంతో కలెక్టర్‌కు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళీ, వెలుగు డీపీఎం(ఫైనాన్స్) వీవీ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

▸ ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు. రాజీ మార్గం రాజమార్గమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈమేరకు సోమవారం ఎస్పీ ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్ అదాలత్‌లో పది రకాల కేసుల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. కేసులు వేగవంతం, సానుకూల వాతావరణంలో పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకింగ్, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కుటుంబ తగాదాలు, విడాకుల కేసులు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. వివరాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణంలోను, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల మండల న్యాయ సేవా సంఘాలను సంప్రదించి వివరాలు పొందవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

ఇంటికో ఉద్యోగమే లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

జిల్లాలో అధిక పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకువచ్చాయని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు, అవమానాలు పడ్డారని, అయినా పోరాటంలో వెనక్కి తగ్గలేదన్నారు. కార్యకర్తల సంక్షేమానికి కూడా పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కోటవురట్ల- అడ్డరోడ్డు ప్రధాన రహదారి పనులు త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో యువతకు పెద్దపీట వేస్తున్నామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, నియోజకవర్గం నేతలు విలియం కేరీ, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, చించలపు పద్దు, ఫైబోయిన రమణ, అబద్దం, అల్లు నర్సింహమూర్తి, గుర్రం రామకృష్ణ, వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.21.18 కోట్లు మంజూరు

... 5వ పేజీ తరువాయి

ప్రణాళిక అమలు చేయనున్నట్టు తెలిపారు. కాగా కోర్టు సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 21 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే రాజును బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కామిరెడ్డి వెంకటరావు, టీడీపీ స్టేట్ లీగల్‌సెల్ కార్యదర్శి గూనూరు లక్ష్మీనారాయణ, చీపురుపల్లి సూర్యనారాయణ, పి.శ్రీనివాసరావు, గొర్లె కృష్ణవేణి, వేసలపు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ కల దిశగా అడుగులు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణ



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రతిభ ఉన్న యువతను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అఖిల భారత స్థాయిలో నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలకు సాంఘిక సంక్షేమ శాఖ శిక్షణ ఇవ్వనుంది. జిల్లాలో ప్రతిభావంతులైన యువకులు ఆర్థిక కారణాలతో ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత ఉద్యోగాలు అందిపుచ్చుకోలేకపోతున్నారు. స్థానికంగా సరైన శిక్షణ సంస్థలు లేక, సుదూర ప్రాంతాల్లోని ప్రైవేటు విద్యా సంస్థల్లో శిక్షణ పొందేందుకు అవకాశం లేక సివిల్ సర్వీసెస్‌కు దూరమవుతున్నారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల జరిగిన జిల్లా విద్యాశాఖాధికారుల సమావేశంలో పేద విద్యార్థులకు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు హాజర్యేందుకు ఉచిత శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈమేరకు మార్గదర్శకాలు వెలువడడంతో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ ద్వారా ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. నిరుద్యోగ యువతలో పోటీ పరీక్షలపై అవగాహన పెంచడం, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు పేద, వెనుబడిన వర్గాలకు ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత ఉద్యోగాల సాధనలో సహాయపడడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. జిల్లాలో ప్రతిభావంతులైన అనేకమంది ఆర్థిక కారణాలతో అత్యున్నత కోచింగ్ పొందులేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సివిల్స్ కొట్టాలని పరితపించే పేదింటి యువతకు కూటమి ప్రభుత్వం పోత్సాహకంగా ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉచిత శిక్షణలో సాధారణ అధ్యయనం, ప్రస్తుత వ్యవహారాలు, భారత రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, విజ్ఞాన సాంకేతిక పరిజ్ఞానం, వ్యాస రచన, వ్యక్తిత్వ వికాసం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు వంటి అంశాలపై నిపుణులైన అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వనున్నారు.

నేడు దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీ

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు పేదింటి విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఏపీస్టడీసర్కిల్. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.8 లక్షలు లోపు ఉండాలి. దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, పదో తరగతి, డిగ్రీ, ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మంగళవారం సాయంత్రంలోగా జిల్లా సాంఘిక సాధికార అధికారికి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. అర్హత పొందిన అభ్యర్థులకు శిక్షణ కోసం డిసెంబరు 5వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ఫలితాలు ఆధారంగా తుది ఎంపిక అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు డిసెంబరు 12 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. విశాఖపట్నంలోని ఏపీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో శిక్షణ ఇస్తారు. నాలుగు నెలల పాటు ఉచిత భోజనం, వసతి, అధ్యయన సామగ్రి, మెంటరింగ్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాంఘిక సాధికార అధికారి శ్రీదేవి కోరారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

▸ కలెక్టర్ విజయకృష్ణన్

▸ పీజీఆర్ఎస్‌లో 295 వినతులు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన అర్జీలను త్వరతగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్‌వో వై. సత్యనారాయణరావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. మొత్తం 295 అర్జీలు అందాయని, వాటిని ఆయా శాఖలకు పరిష్కార నిమిత్తం పంపించామన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఒకసారి కలెక్టరేట్ గడప తొక్కిన వారు మరోమారు అదే సమస్యతో తిరిగి రాకూడదన్నారు. ఆ దిశగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో జి. రామారావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ పాల్గొన్నారు.



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అర్జీలను గడువులోగా పరిష్కరించండి

▸ ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల అర్జీల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయం సమావేశమందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 60 వినతులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులకు సకాలంలో పరిష్కారం చూపుతామన్నారు. ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హాకీ పోటీలు



రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నెల్లూరు బాలుర జట్టు



ప్రథమ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జిల్లా బాలికల హాకీ జట్టు

▸ విజేతలుగా నెల్లూరు బాలుర జట్టు, తూ.గో బాలికల జట్టు

▸ విశాఖ బాలికల జట్టుకు ద్వితీయ స్థానం

నక్కపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మూడు రోజుల పాటు ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల,బాలికల హాకీ పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు ఎంతో రసవత్తరంగా సాగాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో నెల్లూరు జట్టు ప్రథమ స్థానం సాధించగా, తూర్పు గోదావరి ద్వితీయ స్థానం, విశాఖ బాలుర జట్టు తృతీయ స్థానం సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు. బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా, విశాఖ జట్టు ద్వితీయ స్థానం, అనంతపురం జట్టు తృతీయ స్థానం పొందాయి. విజేతలకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ పోటీల రాష్ట్ర పరిశీలకుడు రవిరాజు,వైస్‌ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబు, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీఏ పుష్పలత షీల్డులు అందజేశారు. ఈ పోటీల్లో 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్షుడు చిన్న అప్పారావు, సెక్రటరీ తాతాజీ, కాంగ్రెస్ నాయకుడు మేడేటి శంకర్, ఉప సర్పంచ్ వీసం రాజు, రామచంద్రరావు, నానాజీ, రాంబాబు పాల్గొన్నారు.



ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా బాలికల జట్టు

చెరువుల అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులోనే ప్రత్యేకంగా రావాణాపల్లి ఆనకట్ట మరమ్మతులకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

సాగునీటి పథకాల అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రభుత్వ ఆదేశాలతో డివిజన్‌లో సాగునీటి పథకాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం. మొంథా తుపాన్ వలన దెబ్బతిన్న సాగునీటి చెరువులు, మైనర్, మేజర్ పనులు గుర్తించి రూ.24 కోట్లతో ప్రతిపాదనను అందజేశాం. నిధులు మంజూరు అయిన వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతాం. ఈ పథకం కింద సాగునీటి చెరువులతోపాటు మంచినీటి చెరువులను కూడా మరమ్మతులు చేయవచ్చు.



- బాల సూర్యం, ఈఈ, జలవనరుల శాఖ, నర్సీపట్నం

క్రైం... crime news

అంత్యక్రియలకు వెళ్లి శారదానదిలో రైతు గల్లంతు

▸ తేగాడ గ్రామంలో సంఘటన

▸ సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో వెలికితీసిన మృతదేహం



మృతుడు నగిరెడ్డి చినరమణ (ఫైల్‌ఫొటో)

కశింకోట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి అంత్యక్రియల్లో పాల్గొన్న రైతు శారదానదిలో గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తేగాడ గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు అంత్యక్రియల్లో గ్రామస్థులతో పాటు రైతు నగిరెడ్డి చినరమణ (49) కూడా పాల్గొన్నారు. శారదానది ఒడ్డున స్నానమాచరించేందుకు వెళ్లగా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహానికి చినరమణ గల్లంతయ్యాడు. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించగా సీఐ స్వామినాయుడు నేతృత్వంలో గజ ఈతగాళ్లు శారదానదిలో గాలించి మృతదేహం బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చినరమణకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు సాయిగణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మనోజ్‌కుమార్ చెప్పారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

రావికమతం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌లో గల్లంతైన గుమ్ముడు శ్రీనివాస్ (29) మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. కొత్తకోట గ్రామానికి చెందిన గుమ్ముడు శ్రీనివాస్(29) ఆదివారం పిక్నిక్‌కు వెళ్లి ఈ జలాశయంలో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. వెంటనే పోలీసులు, గజ ఈతగాళ్లు, కూలీలు గాలించినా శ్రీనివాస్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం ఉదయం కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ళు, రావికమతం అగ్నిమాపక సిబ్బంది రిజర్వాయర్‌లో గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో పోరాడతా..

▸ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా... ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టు ఉంది..

▸ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ



తహశీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):టీడీపీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో పోరాడతానని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి గండి బాబ్జీ అన్నారు. ఆయన సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజ, సీఐ జి.రామచంద్రరావుకు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారితో బాబ్జీ మాట్లాడుతూ పీజీఆర్ ఎస్‌లో ఇచ్చిన అర్జీల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. అందరితో పాటే తమ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా.. ప్రతిపక్షంలోనే ఉన్నట్టు ఉందన్నారు. కూటమిలో ఉన్నా.. దురదృష్టవశాత్తూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ పదేపదే తిరుగుతూ, వారితో పోరాడాల్సి వస్తుందన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, వారు పూర్తిగా నిరాశా, నిస్పృహల్లో ఉన్నారన్నారు. కార్యకర్తల కోసం ఎవరితోనైనా పోరాడతానన్నారు. స్థలం ఉండి ఇల్లు లేనివారు, ఇళ్ల స్థలం లేనివారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అధికారులు సానుకూల దృక్పథంతో పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు చైతన్య, నేతలు పల్ల తాతారావు, ఆడారి నాగరాజు, ఎల్లాజీ, బలిరెడ్డి అప్పారావు, రెడ్డి దేముడు, పోతల శ్రీను, బొండా కళ్యాణ్, రాజు, దాడి కన్నంనాయుడు, రామకృష్ణరాజు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్‌పై ఆందోళనకు తాత్కాలిక బ్రేక్

... 5వ పేజీ తరువాయి



తహశీల్దార్‌కు లేఖ అందజేస్తున్న రాజయ్యపేట మత్స్యకార పెద్దలు

రాజయ్యపేట మత్స్యకారులు, నాయకులు కలిశారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలంటూ గత 71 రోజులుగా మత్స్యకారులు టెంట్ ఏర్పాటు చేసిన ధర్నా కొనసాగిస్తున్నారు. ఈ సమస్యపై సీఎం చంద్రబాబుతో చర్చించాలంటే ముందుగా కొన్ని రోజులు టెంట్‌లో ధర్నాను విరమించాలని హోం మంత్రి కోరారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేస్తే ఆందోళన విరమిస్తామని మత్స్యకారులు చెప్పారు. ధర్నా విరమిస్తే తాను సీఎంను కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకుంటానని హోం మంత్రి హామీ ఇచ్చారు. దీనిపై మత్స్యకారులు, నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నుంచి బల్క్‌డ్రగ్ పార్కు రద్దు చేస్తామనే ప్రకటన రాకపోతే మళ్లీ యథావిధిగా టెంట్ ఏర్పాటు చేసి, శాంతియుత ధర్నా కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం రాజయ్యపేటలో వున్న నిరసన శిబిరం వద్దకు వెళ్లి అక్కడున్న వారికి విషయం చెప్పారు. హోం మంత్రి అనిత సూచనల మేరకు తాత్కాలికంగా తాము టెంట్‌లో ధర్నా చేయడాన్ని విరమించాలని ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకున్నామంటూ తహశీల్దార్ నర్సింహమూర్తికి గ్రామస్థులు లేఖ అందజేశారు. ఇందులో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పి.కోదండరావు, పిక్కితాతీలు, మహేశ్‌బాబు, సోమేశ్వరరావు, పిక్కిస్వామి, గంగరాజు, కాశీరావు, నాగేశ్,కారే వెంకటేశ్, నూకమ్మ, నూకరాజు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

ఫుట్‌పాత్‌పైకి చేర్చారు. ఈ ఏడాది మార్చిలో ఇదే విధంగా భారీ బండరాళ్ల లోడు లారీ గడ్డర్‌ను ఢీకొనడంతో ఆ గడ్డర్ రైల్వే ట్రాక్‌ను ఢీకొన్న సంగతి తెలిసిందే. ఆ కారణంగా ట్రాక్ ఒరిగిపోవడంతో పలు రైళ్లకు పెను ప్రమాదం తప్పింది. సోమవారం కూడా మూడో గడ్డర్‌ను లారీ ఢీకొని ఉంటే నాటి పరిస్థితులు ఉత్పన్నమయ్యేవని పలువురు అంటున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని విపక్ష నాయకులు కొణతాల హరనాథబాబు, గంటా శ్రీరామ్, తదితరులు డిమాండ్ చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి పరిశీలించారు. రైల్వే ఆస్తుల నష్టానికి కారణమైన రాజమండ్రికి చెందిన లారీపై కేసు నమోదు చేయడంతో పాటు లారీని అదుపులోకి తీసుకున్నామని ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	635
విజయనగరం	639
శ్రీకాకుళం	639